సాక్షి పశ్చిమగోదావరి

ఆదివారం । 11 । మే । 2025



జాగా కనిపిస్తే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అక్రమంగా ఆక్వా చెరువులు వెలుస్తున్నాయి. గ్రామాల్లో చెరువుల జాతర మొదలైంది.

10లో ▸



ఇంటి పరిహారం ఎప్పుడు ?

పోలవరం ప్రాజెక్ట్ పరిహారం చెల్లింపులో ప్రభుత్వ తీరు నిర్వాసితులను అయోమయానికి గురిచేస్తోంది. పలువురికి ఇంటి పరిహారం జమ కాలేదు.

10లో ▸



స్విమ్మింగ్ పూల్‌లో కూల్‌గా !

జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఏలూరు ఏఎస్‌ఆర్ స్టేడియం వద్ద స్విమ్మింగ్ పూల్‌లో విద్యార్థులకు మెలకువలు నేర్పుతున్నారు.

10లో ▸

సర్దుపోటు!

విద్యుత్ బిల్లుల షాక్

- టీడీపీ కూటమి పాలనలో మినిమం చార్జీలకు కాలం చెల్లు
- ఎఫ్‌పీపీసీఏ చార్జీల పేరిట ఇష్టారాజ్యంగా వడ్డన
- ఒక యూనిట్ వినియోగానికి రూ.737.33 బిల్లు
- భీమవరంలో సర్కారు వీర బాదుడు
- ఒక్కో కనెక్షన్‌పై రూ.400కు పైగా దోపిడీ
- జిల్లావాసులపై దాదాపు రూ.27.97 కోట్ల అదనపు భారం



సాక్షి, భీమవరం : మాకే ఓటెయ్యండి తమ్ముళ్లూ.. 'అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామే తప్ప.. పెంచే ప్రసక్తే లేదు. నేను గ్యారంటీ' అంటూ ఎన్నికల్లో ఊదరగొట్టిన చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చాక ప్లేటు ఫిరాయించారు. వినియోగదారులకు వరుస షాకులిస్తున్నారు. ట్రూఅప్, ఎఫ్‌పీపీసీఏ చార్జీల పేరిట అర్థంకాని లెక్కలతో అదనపు బాదుడు షురూ చేశారు. జిల్లాలోని భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం డివిజన్లలో మొత్తం 6.18 లక్షల గృహావసరాల కనెక్షన్లు ఉన్నాయి.

ఎఫ్‌పీపీసీఏ పేరిట బాదుడు

ఫ్యూయల్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్టమెంట్ (ఎఫ్‌పీపీసీఏ) పేరుతో ప్రస్తుత, పాత సంవత్సరానికి ఫిక్స్‌డ్ కస్టమర్, ఎలక్ట్రిసిటీ డ్యూటీ, సర్‌చార్జీలను సర్దుబాటు పేరిట వినియోగించిన దానికన్నా రెండు మూడురెట్లు బిల్లులు రావడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఎండలు మండుతున్నా బిల్లులకు భయపడి ఏసీలు కూడా ఆన్ చేయడంలేదని, అయినా రెట్టింపు బిల్లులు వస్తున్నాయని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. ఖాళీగా ఉన్న ఇళ్లకు మినిమం రూ.100 నుంచి రూ.150లోపు బిల్లు రావాల్సి ఉండగా రూ.600కు పైబడి బిల్లులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో డొమెస్టిక్, కమర్షియల్ విద్యుత్ కనెక్షన్లు 6,99,430 ఉండగా ఒక్కో బిల్లుపై సగటున రూ.400 చొప్పున సుమారు రూ.27.97 కోట్ల అదనపు భారం పడుతున్నట్లు అంచనా.

సోషల్ మీడియాలో సెటైర్లు

విద్యుత్ బిల్లులు భారీగా పెరిగిపోవడంపై సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు టీడీపీ కూటమి ప్రభుత్వంపై సెటైర్లు వేస్తున్నారు. విద్యుత్ బిల్లులు పెంచబోమంటూ కూటమి పార్టీల అధినాయకులు ఇచ్చిన హామీలు, గత ప్రభుత్వంలో తక్కువగా ఉన్న విద్యుత్ బిల్లులు, నేడు పెరిగిన బిల్లులను చూపిస్తూ పోస్టులు పెడుతున్నారు. వీటికి అధిక సంఖ్యలో లైకులు, షేర్లు వస్తున్నాయి.



భీమవరంలోని బుధవారం మార్కెట్ సమీపంలో సుబ్బారావు అనే వ్యక్తికి రెండు పోర్షన్ల ఇల్లు ఉంది. మరమ్మతుల కోసమని రెండు నెలల నుంచి దానిని ఖాళీగా ఉంచారు. గత నెలకు గాను ఒక పోర్షన్‌లోని మీటరుకు ఒక్క యూనిట్, మరో పోర్షన్‌లోని మీటరుకు మూడు యూనిట్ల రీడింగ్ మాత్రమే వచ్చింది. నిజానికి.. ఈ వినియోగానికి రూ.100 నుంచి రూ.150 లోపు మినిమమ్ చార్జీలతో బిల్లులు రావాల్సి ఉండగా ఒక్క యూనిట్‌కు గాను రూ.737.33, మూడు యూనిట్లకు రూ.609.26 చొప్పున బిల్లులు వచ్చాయి. ఎఫ్‌పీపీసీఏ, ఎఫ్‌పీపీసీఏ-2, ఎఫ్‌పీపీసీఏ-3 పేరిట అర్థం కాని లెక్కలతో అదనపు చార్జీలు బాదేశారని సుబ్బారావు ఆవేదన వ్యక్తం చేశారు.



జిల్లాలో విద్యుత్ కనెక్షన్లు, వినియోగం

విభాగం	కనెక్షన్లు	వినియోగం (మి.యూ.)
గృహావసరాలు	6,18,238	77.67
కమర్షియల్	81,192	17.86
పరిశ్రమలు	2,096	38.45
పంచాయతీ, మున్సిపల్	14,685	12.96
వ్యవసాయ సంబంధిత	17,753	88.22

పేదలంటే కనికరం లేదు



విద్యుత్ బిల్లు వస్తోందంటేనే భయమేస్తోంది. కరెంటు ఎంత పొదుపుగా వాడుకున్నా సరే బిల్లు మాత్రం తగ్గడం లేదు. పేదలంటే ఈ ప్రభుత్వానికి కనికరం లేదు. ఏవో చార్జీలంటూ వినియోగదారులపై భారం మోపుతున్నారు.

– కోరం లలిత, గంగడుపాలెం, యలమంచిలి

సర్దుబాటు చార్జీల పేరుతో..



విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల ముందు కూటమి నాయకులు హామీ ఇచ్చారు. ఇప్పుడు సర్దుబాటు పేరుతో పేదలపై అదనపు భారాన్ని మోపుతున్నారు. పెరిగిన చార్జీలు ఆక్వా రైతులకు భారంగా మారాయి.

– పీవీఆర్‌కే ఆంజనేయరాజు, వాండ్రం, ఉండి

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోలు లక్ష్యం పెంచాలి



భీమవరంలో పట్టుబడులపై ఆరా తీస్తున్న కౌలు రైతు సంఘ నాయకులు

భీమవరం: ప్రభుత్వం లక్ష్యం పెంచి దాళ్వా ధాన్యం కొనుగోలు చేయాలని, నూక శాతం పేరుతో మిల్లర్ల దోపిడీని అరికట్టాలని ఏపీ కౌలు రైతుల సంఘం డిమాండ్ చేసింది. శనివారం సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు ధాన్యం పట్టుబడులను పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. పూర్తిస్థాయిలో ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా వెళ్లిన ధాన్యాన్ని టార్గెట్ పూర్తయిందంటూ మిల్లర్లు దింపుకోవడం లేదని రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. కొందరు మిల్లర్లు ఎంటీయూ 1156 రకం కొనుగోలు చేయడం లేదని, కొనుగోలు చేసినా 75 కిలోల బస్తాకు అదనంగా రెండు నుంచి నాలుగు కిలోలు తీసుకుంటున్నారన్నారు. అధికారులు ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరారు.

12 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



భీమవరం: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 12న ప్రారంభం కానున్నాయని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి ఎ.నాగేశ్వరరావు శనివారం విలేకరులకు తెలిపారు. జిల్లాలోని 40 కేంద్రాల్లో 18,265 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. ఫస్టియర్ జనరల్ కేటగిరీలో 13,494, ఒకేషనల్ కేటగిరీలో 1,020, సెకండియర్ జనరల్ కేటగిరీలో 3,201, ఒకేషనల్ కేటగిరీలో 550 మంది విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. ఫస్టియర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండియర్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయన్నారు. రెండు ఫ్లయింగ్ స్క్వాడ్స్, రెండు సిట్టింగ్ స్క్వాడ్స్, 13 స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటు చేసినట్టు నాగేశ్వరరావు చెప్పారు. పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతాయన్నారు.

జూలై 5న లోక్ అదాలత్



ఎ.వాసంతి, జిల్లా జడ్జి

నరసాపురం: జూలై 5న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి అన్నారు. ఈ నెల 10న జరగాల్సిన జాతీయ లోక్‌అదాలత్‌ను జూలై 5కు వాయిదా వేశామన్నారు. కార్యక్రమం నిర్వహణకు మరో రెండు నెలల సమయం వచ్చినందున ఈసారి మరిన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా న్యాయవాదులు, పోలీసులు ప్రయత్నించాలని సూచించారు. కక్షిదారులకు అవగాహన కల్పించి, లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించాలని తెలిపారు.

యుద్ధ పరిస్థితులపై అవగాహన తప్పనిసరి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: యుద్ధాన్ని ఎవరు కోరుకోవడం లేదని తప్పనిసరి పరిస్థితిలో, అనివార్యమైతే సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తగిన అవగాహనతో పౌరులంతా సిద్ధంగా ఉండాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. మినిస్ట్రీ ఆఫ్ సివిల్ డిఫెన్స్ ఇన్ ఇండియా రూపొందించిన సమాచారాన్ని క్రోడీకరించి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ తయారుచేసిన 'యుద్ధం మాకు వద్దు.. అనివార్యమైతే ఎదుర్కొనేందుకు మేం సిద్ధం' అనే పుస్తకాన్ని శనివారం క్యాంపు కార్యాలయంలో ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యుద్ధం అనివార్యమైతే త్రివిధ దళాలతో పాటు పౌరులు కూడా సైనికులుగా మారాల్సి ఉంటుందన్నారు. శిక్షణ లేకున్నా అవగాహన ద్వారా యుద్ధ సమయంలో పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి వీలవుతుందనే లక్ష్యంతో ఈ పుస్తకాన్ని రూపొందించినట్టు చెప్పారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారి ఆర్.కుమరేశ్వరన్ పాల్గొన్నారు.

మళ్లీ జగనన్న పాలన రావాలని..



మెట్లకు బొట్లు పెడుతున్న జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, పార్టీ అధినేత జగన్ చిత్రపటాన్ని చూపుతూ (ఇన్‌సెట్‌లో)

జంగారెడ్డిగూడెం: మళ్లీ జగనన్న పాలన వచ్చి పేదల మోముల్లో చిరునవ్వు నిలవాలని జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి రావాలని కోరుకుంటూ శనివారం ఆమె ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించి పూజలు చేయించారు. దక్షిణాముఖంగా ఉన్న శ్రీవారి మెట్లకు బొట్లు పెట్టుకుంటూ ఆలయానికి చేరుకుని, ప్రదక్షిణలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఎటువంటి సంక్షేమం అందక పేద, బడుగు, బలహీన వర్గాల వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎటువంటి అభివృద్ధి, సంక్షేమం కానరాకపోగా, ఆర్భాటాలు, ప్రచారాలు, హడావుడి కనిపిస్తున్నాయన్నారు. కూటమి పాలన నుంచి విముక్తి కలిగి మళ్లీ జగనన్న రాజ్యం రావాలని ఆమె ఆకాంక్షించారు.

రైతులను సర్వనాశనం చేస్తున్న కూటమి

- సంచుల కొరత.. టార్గెట్‌ల పేరుతో ఆంక్షలు
- మాజీ మంత్రి కారుమూరి విమర్శలు



తణుకులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: పంట దిగుబడి అధికంగా వచ్చిందన్న ఆనందాన్ని ఆవిరి చేసేలా గోనె సంచుల కొరత సృష్టించి కూటమి ప్రభుత్వం రైతులను నిట్టనిలువునా ముంచేసిందని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. తణుకులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం గోనె సంచులు సరఫరా చేయకపోవడం వల్లే రైతులు పండించిన ధాన్యం నీటిపాలైందని మండిపడ్డారు. సాక్షాత్తూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ధాన్యం కొనుగోలు చేయలేమన్నారంటే.. ఈ కూటమి ప్రభుత్వంలో రైతులు ఎంత దౌర్భాగ్యపు స్థితిలో ఉన్నారో అర్థమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోపక్క ధాన్యం మొత్తం కొనుగోలు చేయకుండా టార్గెట్ పూర్తయిందంటూ కొనుగోళ్లు నిలిపివేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముందుచూపుతో పంటను ఆన్‌లైన్‌లో నమోదు చేయించేవారని, బీమా చేయించేవారని, చివరి గింజ వరకూ ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేసేవారని, ఏ పంట నష్టానికి ఆ సీజన్‌లో పరిహారం అందించారని గుర్తుచేశారు. ఇప్పుడు అన్నిరకాలుగా రైతులను సర్వనాశనం చేసే పరిస్థితి రాష్ట్రంలో దాపురించిందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో పీడీఎస్ బియ్యం రవాణాపై నిఘా పెట్టి లారీలను సీజ్ చేస్తూ కఠినంగా వ్యవహరించే పరిస్థితులు ఉండేవని, అయితే నేడు కూటమి ప్రభుత్వ నేతలు మట్టి, ఇసుక, పీడీఎస్ బియ్యం వంటి అంశాలను ఆర్థిక వనరుగా మార్చుకున్నారని విమర్శించారు. తణుకులో పేకాటలు యథేచ్ఛగా జరుగుతున్నాయని, పోలీసులు, పేకాటరాయుళ్లు పేకముక్కల్లా కలిసిపోయారని ధ్వజమెత్తారు. మద్యం దుకాణాల తీరును రానున్న రోజుల్లో ఎండగడతామని, నిబంధనల ప్రకారం దుకాణాలు నడవకపోతే ఉద్యమం చేస్తామని కారుమూరి హెచ్చరించారు.

యథేచ్ఛగా పర్మిట్ రూములు, బెల్టుషాపులు

రాష్ట్రవ్యాప్తంగా మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూమ్‌లు, బెల్టు షాపులు యథేచ్ఛగా నడుస్తున్నాయని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సభ్యుడు వెలగల సాయిబాబారెడ్డి విమర్శించారు. ముఖ్యంగా తణుకులో ప్రతి మద్యం దుకాణం వద్ద పర్మిట్ రూమ్ నడుస్తోందని చెప్పారు. ఈ విషయంపై తణుకు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ సీఐ సత్తి మణికంఠరెడ్డిని సమాచార హక్కు చట్టం ప్రకారం అడిగితే తణుకు స్టేషన్ పరిధిలో 33 మద్యం దుకాణాలు ఉన్నాయని, ఇటీవల కాలంలో నమోదు చేసిన కేసుల వివరాలు తెలిపారని వివరించారు. రానున్న రోజుల్లో మద్యం దుకాణాల వద్ద ఉన్న పర్మిట్ రూమ్‌లను సందర్శించి చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొట్ల సురేష్, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, బెజ్జవరపు హేమశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. ఎదుర్కోలు ఉత్సవం

- అట్టహాసంగా శ్రీవారి తిరువీధి సేవ
- నేడు చిన వెంకన్న కల్యాణోత్సవం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న వైశాఖ మాస దివ్య బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గో రోజు శనివారం రాత్రి జరిగిన ఎదుర్కోలు ఉత్సవం నేత్రపర్వంగా సాగింది. బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాధాన్యమున్న ఈ వేడుకను శ్రీవారి కల్యాణోత్సవం ముందు రోజు జరిపించడం ఆనవాయితీ. ముందుగా స్వామి, అమ్మవార్ల కల్యాణ మూర్తులను ఆలయం నుంచి తొళక్క వాహనంపై తీసుకువచ్చి నిత్య కల్యాణ మండపంలో వెండి శేష వాహనంపై వేంచేపు చేసి హారతులిచ్చారు. అనంతరం ఎదుర్కోలు ఉత్సవాన్ని ప్రారంభించారు. ఆలయ అధికారులు, అర్చకులు, పండితులు, భక్తులు రెండు జట్లుగా విడిపోయి ఒక జట్టు శ్రీవారి గుణగణాలను, ఆయన విశిష్టతను, రెండో జట్టు అమ్మవార్ల గుణగణాలను కొనియాడారు. వివాహానికి ముందు రోజు వధూవరుల తరపు బంధువులు శుభలేఖను పఠించేందుకు జరిపే కార్యక్రమమే ఎదుర్కోలు ఉత్సవమని పండితులు తెలిపారు. ఉదయం హనుమద్వాహనంపై శ్రీవారి తిరువీధి సేవ శోభాయమానంగా సాగింది. ఆలయ ముఖ మండపంలో శ్రీ మురళీ కృష్ణ అలంకారంలో ఉన్న శ్రీవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించారు. శ్రీహరి కళాతోరణ వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.



హనుమద్వాహనంపై స్వామి వారికి హారతులు



ఎదుర్కోలు ఉత్సవంలో..

బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 7 గంటల నుంచి.. సింహ వాహనంపై తిరువీధి సేవ.
- రాత్రి 8 గంటల నుంచి.. శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవం, అనంతరం వెండి గరుడ వాహనంపై తిరువీధి సేవ.
- శ్రీవారి ప్రత్యేక అలంకారం.. మోహిని

కల్యాణోత్సవానికి భారీ ఏర్పాట్లు

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టం తిరుకల్యాణోత్సవాన్ని ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించేందుకు అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ తూర్పు రాజగోపురం వద్ద భారీ వేదికను నిర్మిస్తున్నారు. ఆలయ ఈఓ ఎన్వీ సత్యనారాయణమూర్తి పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. కల్యాణ మండప ప్రాంతం, క్షేత్ర పరిసరాలను సుందరీకరించారు. స్వామివారు ఆలయం నుంచి తూర్పు రాజగోపురం మీదుగా కల్యాణ వేదిక వద్దకు రాత్రి 7.30 గంటల సమయంలో చేరుకుంటారు. అలాగే సోమవారం రాత్రి చినవెంకన్న రథోత్సవం నిర్వహించనున్నారు.



తూర్పు రాజగోపురం వద్ద కల్యాణ వేదికను నిర్మిస్తున్న దృశ్యం

భారత సైన్యానికి సంఘీభావం

భీమవరం (ప్రకాశంచౌక్): భారత సైన్యానికి మనోధైర్యం కల్పించేందుకు భీమవరం, ఉండి నియోజకవర్గాల స్థాయిలో శనివారం భీమవరంలో భారీ సమైక్యతా ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదాన్ని తుద ముట్టించడమే లక్ష్యంగా పోరాడుతున్న సైన్యానికి అందరూ సంఘటితంగా ఉంటూ సంపూర్ణ మద్దతు ప్రకటిద్దామని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. జువ్వలపాలెం రోడ్డులోని అడ్డ వంతెన మూర్తి రాజు విగ్రహం నుంచి టాటా విగ్రహం వరకు పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, కలెక్టర్ సీహెచ్ నాగరాణి, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. వీర మరణం పొందిన జవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ దేశంపై ఎలాంటి దాడులను ఉపేక్షించేది లేదన్నారు. పీఏసీ చైర్మన్ రామాంజనేయులు మాట్లాడుతూ తీవ్రవాదాన్ని అంతమొందించడంలో ప్రధాని మోదీకి అందరూ మద్దతుగా నిలవాలని కోరారు. అడిషనల్ ఎస్పీ వి.భీమరావు, ఎక్సైజ్, అగ్నిమాపక శాఖ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



భీమవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జై జవాన్.. జై భారత్



ఏలూరులో అమరవీరులకు జోహార్లు అర్పిస్తున్న చిన్నారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆపరేషన్ సిందూర్‌లో వీర మరణం పొందిన ఎం.మురళీనాయక్, సైనికులకు ఏలూరు దత్తాశ్రమం, అశోక్‌నగర్ నమస్తే పార్కు వద్ద బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో జాతీయ జెండాలు, కొవ్వొత్తులతో శనివారం నివాళులర్పించారు. సంఘ జిల్లా నాయకుడు ధరావత్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ యుద్ధభూమిలో వీరమరణం పొందిన మురళీ నాయక్ ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచి ఉంటారన్నారు. భూక్యా నాగరాజు నాయక్ మాట్లాడుతూ భారత సైన్యంలో ఆత్మస్థైర్యం నింపడానికి దేశ ప్రజలంతా ఏకమై అండగా నిలవాలని కోరారు. జరభల వెంకట కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ మురళీనాయక్ వంటి సైనికుల ప్రాణాలకు విలువ కట్టలేమన్నారు. స్థానికులు, విద్యార్థులు, చిన్నారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెండ్లి కుమారుడిగా మీసాల వెంకన్నస్వామి



కై కలూరు: మీసాల వెంకన్న వార్షిక బ్రహోత్సవాలు కైకలూరులో అత్యంత వైభవంగా శనివారం ప్రారంభమయ్యాయి. స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచన, పంచామృత అభిషేకాలు చేశారు. స్వామివారిని పెండ్లికుమారుడు, అమ్మవారిని పెండికుమార్తెగా అలంకరించారు. సుదర్శన హోమం నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం మాడ వీధులలో గజ వాహనంపై స్వామిని ఊరేగించారు. ఆలయ ఈవో వీఎస్‌కే.శేఖర్ మాట్లాడుతూ ఆదివారం రాత్రి 7.10 గంటలకు స్వామి దివ్య కల్యాణం జరుగుతుందన్నారు.

మద్దిలో అభిషేక సేవ



మద్ది క్షేత్రంలో ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహానికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

జంగారెడ్డిగూడెం: గురవాయిగూడెంలో తెల్ల మద్ది చెట్టు తొర్రలో స్వయంభూగా వెలిసిన శ్రీ మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ఉత్సవమూర్తికి పంచామృత అభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

జాగా కనిపిస్తే చేపల చెరువులే

- వేమవరప్పాడులో శ్మశానాన్ని ఆక్రమించి తవ్వకం
- ఎలాంటి అనుమతులూ లేకుండా పనులు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఆగని వైనం


సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అక్రమంగా ఆక్వా చెరువులు వెలుస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో చెరువుల జాతర ప్రారంభమైంది. శ్మశాన వాటిక స్థలాలను సైతం చేపల చెరువుల్లో కలిపేసుకుంటున్నారు. ఎప్పటి నుంచే అమలవుతున్న ప్రభుత్వ నిబంధనలను గాలికొదిలేస్తున్నారు. రాజకీయ నాయకుడి మాటే చట్టంగా మారుతోంది. తప్పు జరుగుతోందని తెలిసినప్పటికీ అధికారులు నోటీసిచ్చి పనైపోయిందని చేతులు దులుపేసుకుంటున్నారు. ఈలోపు అనుమతులు లేకుండానే చేపల చెరువులు వెలుస్తున్నాయి. కై కలూరు మండల శివారు గ్రామం వేమవరప్పాడులో 10 వార్డులు ఉన్నాయి. మొత్తం 3,000 మంది జనాభా ఉన్నారు. కూలీ పనులపై ఎక్కువగా ఆధారపడి జీవిస్తున్నారు. గ్రామంలో బస్టాప్ వెనుక 3 ఎకరాల్లో శ్మశాన వాటిక ఉంది. సమీపంలో బుర్ల సత్యనారాయణకు చెందిన సర్వే నంబరు 177/1, 2, 3, 13లో 2.99 ఎకరాల భూమిని చేపల చెరువుగా తవ్వుతున్నాడు. చెరువు రూపంలో వచ్చిన మట్టిని మైనింగ్‌కు విక్రయిస్తున్నారు. ఆక్వా చెరువు తవ్వకానికి ఎలాంటి అనుమతులు లేవు.

సర్పంచ్ మాటకు విలువ లేదు

గ్రామ ప్రథమ పౌరుడు, సర్పంచ్ నున్న రాంబాబు శ్మశాన వాటిక స్థలాన్ని ఆక్రమించుకుని చెరువు తవ్వుతున్నారని, ప్రభుత్వ అనుమతులు లేవని ఏప్రిల్ 28న ఏలూరు కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. శ్మశానంలో హిందూ సాంప్రదాయతో పాటు క్రైస్తవమతం తీసుకున్న కొందరు సమాధి చేస్తారు. ఆ సమయంలో సమీప చేపల చెరువులో ఊట నీరు బయటకొస్తే సమాధులకు ఇబ్బందులుంటాయని పేర్కొన్నారు. ఇదే కాకుండా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వీర్యమవుతోందన్నారు. దీంతో ఈ నెల 6న ఫిషరీష్ ఏడీ రాజ్‌కుమార్ బుర్ల సత్యనారాయణకు నోటీసులు ఇచ్చారు. పనులు మాత్రం ఇప్పటికీ ఆగలేదు.



కైకలూరు మండల వేమవరప్పాడులో అక్రమ చెరువును పరిశీలిస్తున్న ఫిషరీష్ ఏడీ రాజ్‌కుమార్



చేపల చెరువు యజమానికి ఫిషరీష్ అధికారులు అందించిన నోటీసు

నిబంధనలకు పాతర

కొత్త చెరువు తవ్వాలంటే 2019 మార్చి 16న విడుదలైన జీవో నంబరు7ను అమలు చేయాలి. 2020లో వచ్చిన అప్సడా యాక్టు నిబంధనలు పాటించాలి. నాన్ ఆక్వా జోన్‌లో రెవెన్యూ, ఫిషరీష్, వ్యవసాయం, ఇరిగేషన్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వంటి శాఖల అనుమతివ్వాలి. మండల స్థాయి తర్వాత జిల్లా స్థాయి కమిటీ అధికారులు డీఎల్‌సీలో అనుమతులు అందిస్తారు. వ్యవసాయ భూములు, తాగునీటి చెరువులు, దేవాలయాలు, పాఠశాలలు, శ్మశానాలు వంటి వాటికి 3 నుంచి 5 మీటర్ల దూరంలో చెరువులు తవ్వుకోవాలి. ఇలాంటి నిబంధనలు ఉన్నా కేవలం రాజకీయ నాయకుడి అండతో చెరువులు తవ్వేస్తున్నారు. వేమవరప్పాడు విషయంలో వీఆర్వో రంగనాయకమ్మను వివరణ కోరగా.. చెరువు తవ్వకానికి ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. షిషరీష్ సిబ్బంది మాత్రం రెవెన్యూ అధికారులు సహకరిస్తే అక్రమ పనులు అడ్డుకుంటామంటున్నారు.

నోటీసులు ఇచ్చాం



అనుమతులు లేకుండా వేమవరప్పాడులో చేపల చెరువు తవ్వుతున్న బుర్ల సత్యనారాయణకు మత్స్యశాఖ నుంచి నోటీసులు అందించాం. ప్రభుత్వ నిబంధనలు అందరూ పాటించాలి. వేమవరప్పాడులో అక్రమ చెరువు తవ్వకం పనులు నిలుపుదలకు సిబ్బందిని పంపుతాం.

– బి.రాజ్‌కుమార్, మత్స్యశాఖ ఏడీ, కైకలూరు

ఇంటి పరిహారం ఎప్పుడు?

పోలవరం నిర్వాసితుల ఎదురుచూపులు



కుక్కునూరు ఏ బ్లాక్‌లో జాబితాలో లేని ఇల్లు

కుక్కునూరు: పోలవరం పరిహారం చెల్లింపులో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు నిర్వాసితులను అయోమయానికి గురిచేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక గత జనవరిలో ప్రాజెక్ట్ 41.15 కాంటూర్ పరిధి బ్యాక్ వాటర్‌లో ముంపునకు గురవుతున్న గ్రామాలకు ఆర్ అండ్ ఆర్ వ్యక్తిగత, ఇంటి విలువకు ప్యాకేజీ చెల్లించింది. వ్యక్తిగత ప్యాకేజీ దాదాపు అందరికీ జమ కాగా ఇంటి విలువకు సంబంధించిన పరిహారం మాత్రం కొందరికి మాత్రమే జమచేశారు. చాలా మంది నిర్వాసితులకు ఇంటి విలువలకు సంబంధించిన పరిహారం జమ కాలేదు.ఇ ఈ సంవత్సరం పరిహారం చెల్లింపు ఉంటుందా లేదా అన్న మీమాంసలో నిర్వాసితులు ఉన్నారు.

పోలవరం సర్వేలో భాగంగా నిర్వాసితుల ఇళ్లకు సంబంధించి సర్వే చేసి కొలతలు సేకరించిన సిబ్బంది వాటిని కంప్యూటరైజ్ చేశారు. అనంతరం ప్రదర్శించిన రెండు జాబితాల్లో ఉన్న నిర్వాసితుల పేర్లు మూడో జాబితాలో లేకుండా పోయాయి. తమ పేర్లు జాబితా నుంచి గల్లంతైన విషయం తెలిసిన నిర్వాసితులు అధికారులను కలిసి వివరించారు. అధికారులు సిబ్బందిని నిర్వాసితుల ఇళ్లకు పంపి ఇంటి కొలతలు, తగిన ఆధారాలు, ఇంటి ఫొటోలు సేకరించారు. అయితే జాబితాలో వారి పేర్లు నమోదు చేశారా? లేదా అనేది నిర్వాసితులకు చెప్పలేదు. మండల స్థాయి అధికారులు నిర్వాసితులకు సంబంధించిన వివరాలు నిజమేనని ధ్రువీకరించి జిల్లా అధికారులకు పంపినప్పటికీ జిల్లా స్థాయి అధికారులు నిర్వాసితులకు న్యాయం చేయడంలో విఫలమవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పేర్లు గల్లంతైన నిర్వాసితులు ఎప్పటికి న్యాయం జరుగుతుందోనని ఎదురుచూస్తున్నారు.

ఇంటి పరిహారం అందలేదు



కుక్కునూరు ఏ బ్లాక్ రామాలయం సమీపంలో మా ఇంటి కొలతలు తీసుకున్నారు. సర్వే నెంబర్ ఏ–220గా నిర్ధారించారు. .పంచాయతీలో ప్రదర్శించిన జాబితాలో పేరు ఉంది. నాకు ఆర్ అండ్ ఆర్ వ్యక్తిగత ప్యాకేజీ మాత్రమే చెల్లించారు. ఇంటి పరిహారం రాలేదు. అదేంటని అడిగితే అసలు ఆ నెంబర్ మీద నా డేటానే లేదని చెప్పారు. 2022లో వచ్చిన గోదావరి వరదలో ఇల్లు కూలిపోయింది.

– మాదిరాజు ఖాదర్‌బాబా, నిర్వాసితుడు, కుక్కునూరు

ప్రభుత్వం న్యాయం చేయాలి



మా గ్రామంలో నిర్వాసితులకు ఇటీవల ఆర్ అండ్ ఆర్ వ్యక్తిగత, ఇంటి పరిహారాన్ని చెల్లించారు. కొంతమంది పేర్లు స్ట్రక్చర్ వాల్యూ జాబితాలో లేవు. విషయాన్ని అధికారులకు చెప్పి అన్ని ఆధారాలు సమర్పించాం. మాకు కూడా ఇంటికి రావాల్సిన పరిహారాన్ని చెల్లించి ప్రభుత్వం న్యాయం చేయాలి.

– మేడబలిమి ప్రవీణ్‌కుమార్, నిర్వాసితుడు, కివ్వాక

అనాథ మృతదేహానికి అంతిమ సంస్కారం



మృతదేహాన్ని ఖననం చేస్తున్న మానవతా సంస్థ సభ్యులు

భీమవరం: పట్టణంలో అనాథ మృతదేహానికి శనివారం మానవత సంస్థ ఆధ్వర్యంలో అంతిమ సంస్కారం నిర్వహించారు. పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలోని సాయిబాబా ఆలయం వద్ద శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందగా అనాథ మృతదేహంగా గుర్తించిన పోలీసులు మానవత సంస్థకు సమాచారం ఇచ్చారు. దీంతో సంస్థ చైర్మన్ బుద్ధరాజు వెంకటపతిరాజు, కో–చైర్మన్ కారుమూరి నర్సింహమూర్తిబాబు, అల్లు శ్రీనివాస్ స్పందించి మృతదేహాన్ని ఖననం చేశారు.

చోరీకి గురైన బంగారం స్వాధీనం



పోలీసుల అదుపులో చోరీకి పాల్పడిన నిందితుడు

ముదినేపల్లి రూరల్ : చోరీకి గురైన బంగారు వస్తువులను స్థానిక పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని చిగురుకోటకు చెందిన గుబిలి సుబ్బారావు భార్యకు అనారోగ్యంగా ఉండడంతో ఈ నెల 6న విజయవాడ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అనంతరం శుక్రవారం మధ్యాహ్నం ఇంటికి తిరిగి రాగా గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి బీరువాలో ఉంచిన 45 గ్రాముల బంగారు నగలు, 50 గ్రాముల వెండి చోరీ చేశారు. దీనిపై స్థానిక పోలీసుస్టేషన్‌లో శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేయగా కైకలూరు రూరల్ సీఐ వి రవికుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది దర్యాప్తు చేసి చిగురుకోటకు చెందిన పిండి శ్రీనును శనివారం అరెస్టు చేసి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో చొరవ చూపిన సిబ్బంది బి.నాగబాబు, సీహెచ్ లక్ష్మీ శ్రీకాంత్, బి.పవన్‌ను సీఐతో పాటు ఎస్సై వీరభద్రరావు అభినందించారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు సత్యనారాయణ

తణుకు అర్బన్: లారీ ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు మృతిచెందిన ఘటన తణుకు జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామానికి చెందిన మట్టా సత్యనారాయణ (35) స్నేహితుడితో కలిసి తాడేపల్లిగూడెం నుంచి మోటారుసైకిల్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా ఉండ్రాజవరం జంక్షన్ వద్ద టిప్పర్ లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో సత్యనారాయణ లారీ కింద ఇరుక్కుని అక్కడిక్కడే మృతిచెందగా స్నేహితుడు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు లారీ డ్రైవర్ గాదిరెడ్డి దుర్గాప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వరుస చోరీలు.. నిందితుడి అరెస్ట్

చింతలపూడి: వరుస బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని చింతలపూడి పోలీసులు శనివారం పట్టుకున్నారు. సీఐ సీహెచ్ రాజశేఖర్ వివరాలు వెల్లడిస్తూ.. స్థానిక ఫాతిమాపురం చెక్‌పోస్టు వద్ద పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో కృష్ణా జిల్లా జి.కొండూరు మండలం, పాత రేపూడి గ్రామానికి చెందిన కొప్పుల వెంకటేశ్వరరావు అనుమానాస్పదంగా కనిపించడంతో అప్రమత్తమైన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తులో వెంకటేశ్వరరావుపై 35 దోపిడీ, దొంగతనాలు, కేసులు ఉన్నట్లు గుర్తించారన్నారు. నిందితుడు పామర్రు ప్రాంతంలో ఒక వ్యక్తిని మోసం చేసి అతని నుంచి బైక్ దొంగిలించినట్లు విచారణలో తేలిందన్నారు. చింతలపూడి మండలంలోని ఒక వ్యక్తిని జేసీబీ పని పేరుతో నమ్మించి, దాడి చేసి, అతని వద్ద రూ.7,500 నగదు, ఫోన్ దొంగిలించినట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు సీఐ తెలిపారు.

శ్రీవారి క్షేత్రంలో వీధి కుక్కల పట్టివేత



ద్వారకాతిరుమల శివాలయం రోడ్డులో వీధి కుక్కలు పడుతున్న సిబ్బంది

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో సంచరిస్తున్న వీధి కుక్కలను దేవస్థానం అధికారులు శనివారం పట్టించి, అటవీ ప్రాంతానికి తరలించారు. ద్వారకాతిరుమల గ్రామం, ఆలయ పరిసరాల్లో వీధి కుక్కల సంచారం ఎక్కువగా ఉంది. దీంతో క్షేత్రానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీన్ని గమనించిన ఆలయ అధికారులు తాడేపల్లిగూడెంకు చెందిన సిబ్బందితో వాటిని పట్టించారు. మొత్తం 70 శునకాలను పట్టుకుని, దూర ప్రాంతానికి తరలించారు. వాటిని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టమని చెప్పినట్టు అధికారులు తెలిపారు.







స్విమ్మింగ్ పూల్‌లో కూల్‌గా !

వేసవి సెలవుల్లో భాగంగా విద్యార్థులకు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో స్థానిక ఏఎస్ఆర్ స్టేడియం వద్ద ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో మెలకువలు నేర్పుతున్నారు. స్విమ్మింగ్ పూల్ హాల్‌లో జిమ్, మహిళలకు ప్రత్యేక వసతులు కల్పించారు. స్విమ్మింగ్‌తో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం వస్తుందని కోచ్ గణేష్ తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు

దంపతుల ఆత్మహత్యాయత్నం



పాలకొల్లులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భార్యాభర్తలు

పాలకొల్లు సెంట్రల్ : ఆర్థిక సమస్యలతో దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పాలకొల్లులో జరిగింది. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉంటున్న మాదు శ్రీనివాస్ దంపతులు శుక్రవారం మధ్యాహ్నం పెళ్లికి వెళ్తున్నామని చెప్పి ఆగర్తిపాలెంలో తమ పొలం వద్దకు వెళ్లి పురుగుమందు తాగేశారు. బంధువుల కథనం ప్రకారం కుమార్తెకు కూడా పురుగుల మందు కలిపిన గ్లాస్ ఇవ్వగా వాసన వస్తుంది.. తాగలేను అనడంతో భార్యాభర్తలిద్దరూ పురుగుమందు తాగారు. స్థానికుల సమాచారంతో విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు వారిద్దరిని పట్టణంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. శ్రీనివాస్ పరిస్థితి విషమంగా ఉంది. ఆత్మహత్యా యత్నానికి ముందు శ్రీనివాస్ వీడియో రికార్డు చేశారు. 'నాకు అప్పులున్నాయి.. నేను జనం వద్ద తెచ్చుకున్న నగదు సుమారు రూ.10 లక్షల వరకూ తీర్చాలి. వాటిని తీర్చాలంటే నేను అప్పు ఇచ్చిన వ్యక్తి తిరిగి ఇవ్వాల్సి ఉంది. అతను ఇవ్వడం లేదు. అడుగుతుంటే కక్ష గట్టి నా సంగతి చూస్తానంటున్నాడు. నాకు న్యాయం జరగాలంటే ఆత్మహత్య ఒక్కటే శరణ్యం. నేను, నా భార్య, కుమార్తె విషం తీసుకుని చనిపోవాలని నిర్ణయించుకున్నాం. మా చావు తరువాతైనా రావాల్సిన నగదు తీసుకుని బాకీలు సెటిల్ చేసి మిగిలింది మా అక్క, బావలకు ఇప్పించాలని కోరుతున్నాం' అంటూ వీడియోలో పేర్కొన్నాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం దగ్గర బంధువైన కిట్టుకు 20 ఏళ్ల క్రితం శ్రీనివాసు రూ.2.50 లక్షలు ఇచ్చాడు. ఆ నగదుతో పొలం కొన్నారని, ఇప్పుడు తన వాటాగా ఎంత వస్తే అంత ఇవ్వాలని శ్రీనివాసు కోరుతున్నాడని చెప్పారు.

బతుకు పోరులో.. పీకల్లోతు మురుగులో !



బతుకు పోరులో నిజమైన హీరోలు వీరే.. డ్రైనేజీ పక్క నుంచి వెళ్లడానికే మనం చిరాకుపడతాం. రోడ్డుపై మురుగు కనిపిస్తే ఆ చాయలకు వెళ్లేందుకు ఇష్టపడం.. అలాంటిది తీవ్ర దుర్వాసన వెదజల్లే మురుగులో దిగి శుభ్రం చేసే వీరిని చూస్తే బతుకు పోరు ఎంత విచిత్రమో అనిపిస్తుంది. వారు ఒక్క రోజు పనిచేయకపోతే మన జీవనం ఎంత దుర్భరమో.. అందుకు ఈ చిత్రమే నిదర్శనం. ద్వారకాతిరుమలలోని రాణిచిన్నయమ్మారావుపేటలో మురుగుతో నిండిపోయిన డ్రైనేజీని శుభ్రం చేసేందుకు ఓ కార్మికుడు శనివారం అందులో దిగి ఎంతగానో శ్రమించాడు. మురుగు ముందుకు కదలకపోవడంతో పీకల్లోతున మునిగి డ్రైనేజీని శుభ్రం చేశాడు.

– ద్వారకాతిరుమల

అంబరాన్నంటిన సాహితీ సంబరాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అంతర్జాతీయ సాహిత్య సంస్థ శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో స్థానిక మహాలక్ష్మి గోపాలస్వామి కల్యాణ మండపం ఆవరణలో శనివారం ప్రారంభమైన ప్రపంచ సాహితీ సంబరాలు అంబరాన్నంటాయి. కొమ్ము నృత్యాలతో గిరిజన కళాకారులు సంబరాలకు ప్రధాన ఆకర్షణగా నిలిచారు. సుదూర ప్రాంతాల నుంచి సుమారు 1000 మంది కవులు, కళాకారులు హాజరయ్యారు. కళావేదిక సీఈఓ కత్తిమండ ప్రతాప్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని, తెలుగు భాషను, తెలుగు సంస్కృతిని ఖండాంతరాలు వ్యాపింప చేయాలనే ఉద్దేశంతో సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ కళావేదిక సాహిత్య రంగంలో ప్రపంచంలో నెంబర్‌వన్ సంస్థగా నిలుస్తుందన్నారు. కత్తిమండ ప్రతాప్ సాహిత్య సేవలు అనితర సాధ్యమైనవని కొనియాడారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నర్సిపల్లి హారిక, ప్రోగ్రాం కన్వీనర్ పార్థసారథి, కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, రాష్ట్ర అధ్యక్షురాలు జీ ఈశ్వరి భూషణం తదితరులు పాల్గొన్నారు. మాతృదేవోభవ పురస్కారాలను 50 మందికి అందజేశారు. పలువురు సాహితీవేత్తలకు, కవులకు అక్షర తేజం, కవిరత్న పురస్కారాలు అందజేశారు.

కమర్షియల్ ట్యాక్సెస్ నాన్ గెజిటెడ్ కార్యవర్గం ఎన్నిక



అసోసియేషన్ ఏలూరు డివిజన్ కార్యవర్గంతో ఎన్నికల అధికారులు

తణుకు అర్బన్: కమర్షియల్ ట్యాక్సెస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ ఏలూరు డివిజన్ నూతన కార్యవర్గ ఎన్నికలు శనివారం తణుకులో నిర్వహించారు. రాజమండ్రి డివిజన్ అధ్యక్షుడు టి.రాము ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఏలూరు డివిజన్ అధ్యక్షుడిగా పి.రాజేష్ బాబు ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు భవనారి వెంకటేష్‌బాబు, జనరల్ సెక్రటరీ కె.సుధాకర్ ఆదేశాల మేరకు నూతన కార్యవర్గం ఏర్పడినట్లు చెప్పారు. కార్యదర్శిగా వై.నాగేంద్రప్రసాద్, కోశాధికారిగా బీవీ బాబు, అసోసియేట్ అధ్యక్షుడిగా కె.ప్రశాంత్‌కుమార్, ఆఫీస్ సెక్రటరీగా వై.జయశ్రీ, ఉపాధ్యక్షులుగా జి.సతీష్‌కుమార్, సీహెచ్ నరేష్, సహాయ కార్యదర్శులుగా కేఎస్ఎస్ యాదవ్, ఎం.రాజేష్‌ను ఎన్నుకున్నారు.

మట్టి ట్రాక్టర్ల అడ్డగింపు



మట్టి ట్రాక్టర్లను అడ్డుకున్న వీఆర్వో చిన్నారావు

ఉండి: ఉండి మండలం మహాదేవపట్నం గ్రామం రామచంద్రపురంలో అనుమతులు లేకుండా చెరువులో మట్టి తవ్వి ప్రైవేటు భూములు పూడుస్తున్న సుంకర శివ (వార్డు సభ్యుడు), సుంకర శ్రీనుకు చెందిన ట్రాక్టర్లను అడ్డుకున్నట్లు వీఆర్వో చిన్నారావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా మట్టిని తీసుకువెళ్లి ప్రైవేట్ స్థలాన్ని పూడుస్తున్నారని ట్రాక్టర్లు అతివేగంతో తిరుగుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయనే ఫిర్యాదు మేరకు అడ్డుకున్నట్లు చెప్పారు. అనుమతులు లేకుండా తోలకాలు జరిపిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు అభినందనలు



అత్తిలి డిగ్రీ కళాశాలలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్

అత్తిలి: స్థానిక ఎస్వీఎస్ఎస్ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఉద్యోగార్థులకు ప్రాంగణ ఎంపికలు జరిగాయి. బెంగుళూరు, హైదరాబాద్‌కు చెందిన ఫాక్స్‌కాన్ ఐఫోన్, హెచ్‌బీడీ బ్యాంకులలో కళాశాలకు చెందిన విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా 20 మంది విద్యార్థులు ఆయా కంపెనీల ప్రతినిధులు ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల పాలక వర్గ అధ్యక్షుడు దాసం గోవిందరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దాల వెంకటేశ్వర రావు, డిగ్రీ,జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ శ్రీరామశర్మ, డీవీ రమణమూర్తి అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను వినియోగించుకోవాలని కంపెనీల ప్రతినిధులు పి సంతోష్, ఆర్ దుర్గా ప్రసాద్‌లు కోరారు.

రావిపాడులో వెంకటేశ్వరుని కల్యాణం



లడ్డులను స్వామివారికి అందజేస్తున్న దృశ్యం

పెంటపాడు: మండలంలోని రావిపాడులో గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 42వ వార్షిక కల్యాణోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి గ్రామస్తుల ఆధ్వర్యంలో కల్యాణం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన పెన్నాడ శ్రీనివాస్, మంగతాయారు దంపతులతో పెండ్లి వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దువ్వ రూన్నీలక్ష్మి ఫిల్లింగ్ పెట్రోల్ బంక్ అధినేత ఉప్పులూరి ఆంజనేయులు కుటుంబ సభ్యులతో కలిసి భారీ లడ్డూలు స్వామివారికి కానుకలుగా సమర్పించారు.

వరాల వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వరా ల వెంకటేశ్వరస్వామికి శనివా రం విశేష పూజ లు నిర్వహించా రు. వేకువ జాము న స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ జరి పారు. ఉదయం అర్చనలు, ప్రత్యేక పూజలు చేసి, స్వామివారిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేశారు.

వేసవిలో చిన్నారుల సందడి

- పార్కుల్లో సేదతీరుతున్న వైనం..
- ఆట పరికరాలు, ఓపెన్ జిమ్‌ల వద్ద కేరింతలు కొడుతున్న చిన్నారులు
- స్నేహితులతో పార్కుల్లో చిన్నారుల ఆటలు

తణుకు అర్బన్: విద్యాసంవత్సరం ముగిసింది.. వేసవి సెలవులు ఇచ్చారు.. ఇక పిల్లలకు కావా ల్సిందేముంది ఆటలే ఆటలు ఆడేస్తూ సందడి చేస్తున్నారు. స్నేహితులతో కలిసి రహదారులపైనా పార్కుల్లోను వివిధ ఆటలాడుతూ హల్‌చల్ చేస్తున్నారు. బాలురు రోడ్లపై క్రికెట్ అధికంగా ఆడుతుండగా, చిన్నారులు మాత్రం తమకు సమీపంలో ఉన్న పార్కుల్లో ఉన్న ఆటపరికరాలపై కసరత్తులు చేసేస్తున్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు ప్రతిరోజూ సాయంత్రం చల్లబడగానే తమ పిల్లలను పార్కులకు తీసుకువెళ్లి అక్కడఉన్న పరికరాలపై కూర్చోపెట్టి ఆడిస్తున్నారు. దీంతో పిల్లలు ఏడాదిపాటు పుస్తకాలతో నిమగ్నమైఉన్న పరిస్థితి నుంచి బయటపడి కేరింతలు కొడుతూ ఆటలాడుతున్నారు. పార్కుల్లో ఉన్న చిన్నపిల్లలు ఆడుకునే పరికరాలతోపాటు ఓపెన్ జిమ్‌లో సైతం చిన్నా పెద్దా అంతా కసరత్తులు చేస్తూ గడుపుతున్నారు. వృద్ధులు సైతం పార్కులకు వచ్చి సేదతీరుతున్నారు.



తణుకు వైఎస్సార్ పార్కులో ఓపెన్ జిమ్‌లో కసరత్తులు చేస్తున్న చిన్నారులు



ఎన్టీఆర్ పార్కులో అప్ అండ్ డౌన్ ఆడుతున్న చిన్నారులు



ఎన్టీఆర్ పార్కులో జారుడుబల్ల నుంచి దిగుతున్న చిన్నారులు



తణుకు సజ్జాపురం పార్కులో చిన్నారుల సందడి



తణుకు సజ్జాపురం పార్కులో ఇసుకతో ఆడుతున్న చిన్నారులు



తణుకు ఎన్టీఆర్ పార్కులో రంగులరాట్నంలో తిరుగుతున్న చిన్నారులు

పీవీ రావుకు ఘన నివాళి



పీవీరావు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ పీవీరావు 73వ జయంతి కార్యక్రమం జరిగింది. తొలుత పీవీ రావు చిత్రపటానికి శనివారం మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు, నాయకులు పూలమాలలే వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంగరాజు మాట్లాడుతూ ఎస్సీల ఐక్యత కోసం పీవీ రావు ఎన్నో ఉద్యమాలు చేశారని కొనియాడారు. పీవీ రావు ఆశయ సాధనకు కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు టి.మధు, పి.బాలకృష్ణ, బి.రమేష్‌లు పాల్గొన్నారు.

350 మందికి ఉచిత పరీక్షలు



కొండేపాడులో రోగులను పరీక్షిస్తున్న ఆశ్రం డాక్టర్లు

పెంటపాడు: మండలంలోని బి. కొండేపాడు గ్రామంలో శనివారం గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు నగేష్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి చెందిన గుండె వైద్యనిపుణులు, చెవిముక్కు గొంతుపరీక్షలు, చర్మవ్యాధి, కంటివైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. సుమారు 350 మంది రోగులకు వైద్యులు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్యసేవలు అందాలనే ఉద్దేశ్యంతో తాను ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

తల్లిని మించిన దైవం ఉండదు

తాడేపల్లిగూడెం రూరల్: తల్లిని మించిన దైవం ఉండదని, తల్లిని మంచిగా చూసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి అన్నారు. అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని ఆరుగొలను అంగన్‌వాడీ కేంద్రంలో తల్లికి వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ తాను బతుకుతానో లేదో తెలియని పరిస్థితుల్లోనూ ఒక బిడ్డను జన్మనిచ్చేది తల్లి అని పేర్కొన్నారు. నవమాసాలు మోసి బిడ్డల్ని కన్న తల్లిని ఎంతో ఆనందంగా ఉంచాలన్నారు. అనంతరం చిన్నారులు తల్లుల ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బి.రాణి, జీఎస్ఎన్. లక్ష్మి, ఎస్‌కే.కాజీ బీ తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం రూరల్: ఆరుగొలను అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులను ఆశీర్వదిస్తున్న తల్లులు



తాడేపల్లిగూడెం(టీఓసీ): అమ్మ దీవెన కార్యక్రమం



పెంటపాడు: అలంపురం అంగన్‌వాడీ కేంద్రాలలో టీచర్లకు పాద పూజలు చేస్తున్న చిన్నారులు

పిల్లలకు తల్లుల ఆశీర్వచనం

పెంటపాడు: చిన్న వయస్సు నుంచే పిల్లలు తల్లిదండ్రులను ఏవిధంగా గౌరవించాలి అనేది తల్లికి వందనం కార్యక్రమం తెలియజేస్తుందని పలువురు వక్తలు తెలిపారు. శనివారం పెంటపాడు మండలంలో అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా పిల్లలతో తల్లులకు పాదాభివందనం చేయించి, వారికి తల్లులతో ఆశీర్వచనం ఇప్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు దుర్గాభవాని, కె. విశాలాక్షి, జీజీబీ విజయలక్ష్మి, సుజాతలు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా పిల్లలు మంచి అలవాట్లు అలవరచుకోవడంతో పాటు, తల్లిదండ్రులను ఎలా గౌరవించాలనేది నేర్చుకుంటారన్నారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులు పాల్గొన్నారు.

చక్కని చదువులకు అమ్మ దీవెన అవసరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): చక్కని చదువులకు అమ్మ దీవెన తప్పక అవసరమని సీడీపీఓ సరస్వతి అన్నారు. స్థానిక 21వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లికి వందనం కార్యక్రమం జరిగింది. ప్రీ స్కూల్‌కి వచ్చే పిల్లలతో తల్లుల పాదాలకు నీటితో కడిగి పూలతో పూజించి అమ్మ దీవెన తీసుకున్నారు. తల్లులకు మదర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సరస్వతి మాట్లాడుతూ చిన్న నాటి నుంచే పిల్లలకు తల్లిదండ్రుల మీద ప్రేమ అప్యాయతలు తెలుస్తాయని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సీహెచ్ దుర్గా భవాని, కె.విశాలక్షి, కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలంటూ ఈనెల 20న జరిగే సమ్మెకు కార్మిక సంఘాలు మద్దతు తెలపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక చింతపండు మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) సర్వసభ్య సమావేశం శనివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో నరమాల కృష్ణ అధ్యక్షతన జరిగింది. అనంతరం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేశారు. కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్మిక చట్టాలను పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చేందుకు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చూస్తుందని, ఈ చట్టాలను పార్లమెంట్‌లో ఆమోదం చేసి ప్రజల మీద రద్దుదానికి చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక వర్గాన్ని మరింత బానిసలుగా మార్చాలని చట్టాలను మారుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు జవ్వాది శ్రీను, నరమాల కృష్ణ, తంగేటి శ్రీనివాస్, ఏలూరు వేణు, సురేష్, అప్పారావు, సభ్యులు పాల్గొన్నారు.



పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

ఆర్థిక సాయం అందజేత

తణుకు అర్బన్: గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న మహిళ గారపాటి రత్నానికి వైద్య ఖర్చుల నిమిత్తం మానవత స్వచ్ఛంద సేవాసంస్థ రూ10 వేలు ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. పట్టణానికి చెందిన దాత చిట్టూరి సుజాత సౌజన్యంతో ఈ సాయాన్ని అందజేసినట్లు సంస్థ అధ్యక్షురాలు కటారి శారదాదేవి తెలిపారు. శాంతి ర్యాలీ కమిటీ చైర్మన్ గమిని రాంబాబు, డాక్టర్ కోడూరి రాధా పుష్పావతి పాల్గొన్నారు.

ఆల్కహాల్ సేవించడం అనారోగ్యానికి కారణం



తణుకు అర్బన్: అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ మణికంఠరెడ్డి



తాడేపల్లిగూడెం రూరల్: లింగారాయుడిగూడెంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎక్సైజ్ ఎస్సై దొరబాబు

తణుకు అర్బన్: ఆల్కహాల్ సేవించడం ద్వారా స్వల్పకాలిక, దీర్ఘకాలిక అనారోగ్యాలు తలెత్తే అవకాశం ఉందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ సత్తి మణికంఠరెడ్డి అన్నారు. ఆల్కహాల్ దుష్ప్రభావాలపై కమిటీ ఫర్ ఆల్కహాల్ అవేర్‌నెస్ అండ్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్ (కేర్ కమిటీ) ఆధ్వర్యంలో స్థానిక సుధా హాస్పిటల్‌లో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆల్కహాల్ సేవించడం వలన మానవ శరీరంలో వివిధ అవయవాలైన గొంతు, అన్నవాహిక, కాలేయం, పెద్ద ప్రేగులు, గుండె తదితర అవయవాలపై చూపే దుష్ప్రభావాలు చూపుతుందన్నారు. మానసిక ఆందోళన, డిప్రెషన్, అధిక రక్తపోటు తదితర లక్షణాలు మద్యపానం వలన కలుగుతాయని స్పష్టం చేశారు. అనంతరం డాక్టర్ రవిశంకర్ ఆల్కహాల్ సేవించడం వలన కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై బి.లక్ష్మి, ఆర్. మధుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యపానాన్ని విడనాడండి

తాడేపల్లిగూడెం రూరల్: నాటుసారా, మద్యం సేవించడాన్ని విడనాడాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎస్ఐ ఆర్.దొరబాబు అన్నారు. నవోదయం 2.0లో భాగంగా శనివారం మండలంలోని లింగారాయుడిగూడెం గ్రామంలో మద్యపాన వ్యసనంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై దొరబాబు మాట్లాడుతూ మద్యానికి బానిసై అనారోగ్యాలను కొనితెచ్చుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్పీటీసీ వీరమల్లు వెంకన్న, ఉప సర్పంచ్ కాసాని రాంబాబు, హెడ్ కానిస్టేబుల్ విప్లవ్ కుమార్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

కూలీల సమస్యలు పరిష్కరించాలి



దువ్వలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కలింగ లక్ష్మణరావు

తణుకు అర్బన్: ఉపాధి హామీ పథకం కూలీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కలింగ లక్ష్మణరావు కోరారు. శనివారం తణుకు మండలం దువ్వ, ముద్దాపురం, కోనాల గ్రామాల్లో పని ప్రదేశాల్లో ఉన్న ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. శ్రామికుల ఆర్తనాధాలతో, పోరాటాలతో,ఉద్యమాల ద్వారా సాధించుకున్న ఈ చట్టం ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులు నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకు ఈ చట్టం పని దినాలు, కూలీల వేతనాలు కేటాయింపు, పని ముట్లు తగిన స్థాయిలో శ్రామికులకు కేటాయింపులు చేయడం లేదని విమర్శించారు. కార్మిక నాయకులు ఎంతమంది త్యాగజనుల పోరాటాల ద్వారా సాధించుకున్న ఈ చట్టం భవిష్యత్తులో రద్దుచేసే యోచనలో కేంద్ర ప్రభుత్వం ఉందని అందులో భాగంగానే పని దినాలు, పనిముట్లు ఇవ్వడం లేదని ఆయన అన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు దిద్దే నాగేశ్వరావు, శ్రామికులు పాల్గొన్నారు

20న దేశ వ్యాప్త సమ్మె

ఇరగవరం: ఈ నెల 20న దేశ వ్యాప్త సమ్మెలో ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి పిలుపునిచ్చారు. శనివారం ఇరగవరం మండలం రాపాక గ్రామంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, మునిస్వామి మాట్లాడుతూ ఈ నెల 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూస్తోందని తెలిపారు. కూలీలు ఐక్యమత్యంగా ఉపాధి హామీని పరిరక్షించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమలో వి లక్ష్మీ దుర్గ, కె వెంకటరమణ, దాయం కృపాలత, పితాని లక్ష్మీ, వీరవల్లి కుమారి, పితాని మందు లు, ఇంజే సత్యవతి, గొప్పల ఆశా భవాని, వీరవల్లి అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.



రాపాకలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

పెంటపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో కూలీలకు సౌకర్యాలు మెరుగు పరచాలని వ్యవసాయ కార్మికసంఘ, రైతుసంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం పెంటపాడు మండలం ఆకుతీగపాడు, ముదునూరు గ్రామాలలో వారు పర్యటించి ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా చిర్ల పుల్లారెడ్డి, కె. సోమరాజులు మాట్లాడుతూ ఉపాధిలో మస్తర్ల నిర్వహణ సరిగా ఉండేలా చూడాలన్నారు. పెండింగ్ బకాయిలు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. వేసవిలో పనిప్రదేశంలో మజ్జిగ, తాగునీరు, కిట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు.

22 నుంచి క్రీస్తు సువార్త రక్షణ సభలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

పెంటపాడు:ఈనెల 22నుంచి మూడు రోజులపాటు పడాల మార్కెట్ యార్డు వద్ద మూడు రోజుల పాటు క్రీస్తు సువార్త రక్షణ స్వస్తత సభలు నిర్వహించనున్నట్లు జిలా పాస్టర్ల సంఘ అధ్యక్షుడు కె. జాజిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలకు సంబంధించి పోస్టర్లను సంఘ వ్యవస్థాపకురాలు ప్రవక్తిని కొమ్మిశెట్టి అమ్మాజీ ఆవిష్కరించారు. హైదరాబాద్‌కు చెందిన అంతర్జాతీయ వర్తమానికులు బ్రదర్ అనిల్‌కుమార్, హైదరాబాద్ కల్వరి చర్చికి చెందిన జోసఫ్ ప్రకాష్, విజయవాడ బేతేల్ చర్చికి చెందిన బ్రదర్ ఎనోష్‌కుమార్‌లు ఈ సభలలో దేవుని వాక్యం బోధిస్తారన్నారు. ఈ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఘనరాజు, నవీన్‌కుమార్, సత్యకృప పాల్గొన్నారు.